## క్లుప్తంగా

### పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

**సిద్దిపేటకమాన్:** స్వచ్ఛ సిద్దిపేటలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. స్వచ్ఛత సండే కార్యక్రమం పేరిట పట్టణంలోని పలు వార్డులు, లాల్‌కమాన్ ప్రాంతాల్లో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది ఆదివారం ఉదయం రోడ్లను శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనానికి మాత్రమే ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆరోగ్యమే మహాభాగ్యం



5కే రన్‌లో పాల్గొన్న రన్నర్స్

**చిన్నకోడూరు(సిద్దిపేట):** సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని పెద్దకోడూరులో 5కే రన్ నిర్వహించారు. ఎస్‌ఐ సుభాష్ గౌడ్ 5కే రన్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ రోజు వాకింగ్, రన్నింగ్ వంటివి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రన్నర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాపురెడ్డి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### ‘దళిత, గిరిజనులపై దాడులు అరికట్టాలి’

**గజ్వేల్‌రూరల్:** దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డీబీఎఫ్ నాయకులు హైదరాబాద్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా డీబీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలులో రెవెన్యూ, పోలీసులు నిర్లక్ష్యం, వివక్ష పాటిస్తున్నారన్నారు. ప్రజాసంఘాలతో కూడిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీని మూడు నెలలకోసారి జరిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి, నాయకులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామ శివారులో రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా 11 కేవీ, 33 కేవీ విద్యుత్ లైన్‌ల మార్పు కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట డివిజనల్ ఇంజనీర్ మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏన్సాన్‌పల్లి, మెడికల్ కళాశాల ఏరియా, డీఎక్సన్ కంపెనీ, మిట్టపల్లి, ఎల్లుపల్లి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

**తొగుట(దుబ్బాక):** అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన దీక్షలకు ఆదివారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. న్యాయమైన కోర్కెలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్, నాయకులు భూపతిరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### 14వ రోజుకు చేరిన దీక్షలు



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

**చేర్యాల(సిద్దిపేట):** చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం 14వ రోజుకు చేరుకోగా.. దీక్షల్లో పట్టణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు కూర్చున్నారు. ఈసందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఉడుముల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాడు రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించామని.. నేడు డివిజన్ సాధనలో కూడా కీలకపాత్ర పోషిస్తున్నట్టు తెలిపారు. దీక్ష నిర్వహణకు రూ. 10 వేలు విరాళంగా అందించారు. దీక్షలో నర్సింహారెడ్డి, రవీందర్, వేణు, బుచ్చిరాములు, రాము, కొండల్‌రెడ్డి, కృష్ణమూర్తి, అంజయ్య, రాజు, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు. దీక్షను జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ ప్రారంభించగా జేఏసీ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు.

# దోమల హోరు.. జనం బేజారు

**అధ్వానంగా మురుగు కాలువలు**

- దుర్గంధంతో తప్పని అవస్థలు
- గజ్వేల్– ప్రజ్ఞాపూర్‌లోని పలు కాలనీల్లో దుస్థితి

**గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల వ్యాప్తి పెరుగుతుండగా.. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి.**

–గజ్వేల్



డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక నిలిచిన మురుగు నీరు, పక్కన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

మున్సిపాలిటీ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ, లక్ష్మీప్రసన్ననగర్ మధ్య డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక రోడ్డుపైనే మురుగు పారుతోంది. అంతేకాకుండా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి దోమల సంచారం పెరిగిందని కాలనీవాసులు చెబుతున్నారు. అంతేకాకుండా మున్సిపాలిటీ పరిధి ప్రజ్ఞాపూర్‌లోని పలు కాలనీలు, ముట్రాజ్‌పల్లి, క్యాసారం, రాజిరెడ్డిపల్లి, సంగాపూర్, గజ్వేల్‌లోని కోటమైసమ్మ వీధుల్లో పారిశుద్ధ్యలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అంతేకాకుండా ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోనూ ఈ పరిస్థితి ఉంది. మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం రూ.156 కోట్ల వ్యయంతో గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో మాత్రమే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కావొస్తున్నాయి. విలీన గ్రామాలైన ముట్రాజ్‌పల్లి, క్యాసారం, రాజిరెడ్డిపల్లి, సంగాపూర్, సంగుపల్లి గ్రామాల్లో రెండో విడత కింద పనులు చేపట్టాలని అనుకుంటున్నారు. ఇందుకోసం రూ. 49 కోట్లు ప్రతిపాదించగా.. ఆమోదం రావాల్సి ఉంది. పనులకు ఆమోదం వస్తేనే ఆయా గ్రామాల్లో మురుగు సమస్యకు పరిష్కారం లభించనుంది. ఇకపోతే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు లోప భూయిష్టంగా సాగడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్, సిరి ఎన్‌క్లేవ్ తదితర కాలనీల్లో మురుగునీరు చాంబర్లపై నుంచి ఉబికివచ్చి దుర్గంధం వెదజల్లుతోంది. లోపాలు నివారిస్తేనే పట్టణంలో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించి సీజనల్ వ్యాధుల బెడద తప్పనుంది.

### దోమల వ్యాప్తిని అరికడతాం

మున్సిపాలిటీ పరిధిలో దోమల వ్యాప్తికి అరికట్టడానికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. నెలకోసారి అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేస్తున్నాం. యూజీడీ పనులు వందశాతం పూర్తయితే మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

– విద్యాధర్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్





పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సతీష్‌కుమార్

# అభివృద్ధిని చూసే చేరికలు

**హుస్నాబాద్‌రూరల్:** అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను చూసే ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం మీర్జాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానని తెలిపారు. మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. గిరిజన తండాలు ఉన్న మీర్జాపూర్‌లో రూ. 2 కోట్లతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలో పంచాయతీ భవనాలకు రూ. 20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లకావత్ మానస, టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, సర్పంచ్‌లు తరాల లత, విజయలక్ష్మీ, పొన్నబోయిన శ్రీనివాస్, బండి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులతో ప్రభుత్వం చెలగాటం

**గజ్వేల్‌రూరల్:** బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని బీజేపీ, బీజేవైఎం నాయకులు ఆరోపించారు. ఆదివారం బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ బండారు మహేష్, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు పంజాల అశోక్ మాట్లాడుతూ.. గ్రూప్ 1 పరీక్ష రద్దు పట్ల ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. అదేవిధంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఖరితో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. నష్టపోయిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో నాయకులు రాజు, వెంకట్, ప్రవీణ్, వినోద్, శ్రీకాంత్‌గౌడ్, బాలయ్య, కుమార్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

# స్వచ్ఛ దుబ్బాక అందరి బాధ్యత



రోడ్డును ఊడుస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, తదితరులు

**దుబ్బాకటౌన్:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు దరి చేరవని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద 13 వార్డు కౌన్సిలర్ ఆస స్వామి సులోచన, కమిషనర్ గణేష్‌రెడ్డితో కలిసి స్వచ్ఛత లీగ్ 2.0లో భాగంగా రోడ్లను ఊడ్చి చెత్తా చెదారాన్ని ఏరివేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛ దుబ్బాక బాధ్యత అందరిదని, చెత్త రహిత పట్టణంగా మార్చుకునేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎంగారి రాజిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అ‘పూర్వ’ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

**గజ్వేల్‌రూరల్:** తొగుట మండలం వేములఘాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. గత అల్లరిని గుర్తు చేసుకుంటూ ఆత్మీయానురాగాలను పంచుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

# అన్నదాతల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

**గజ్వేల్‌రూరల్:** అన్నదాతల కోసం కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలను వివరించేందుకు బిజేపీ కిసాన్ మోర్చా నాయకులు పొలంబాట పట్టారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు ఏగొండ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎరువుల సబ్సిడీ, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఇప్పటివరకు ఎక్కడా భూసార పరీక్షలు నిర్వహించలేదని, రుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు బాలమల్లు, బూదయ్య, బ్రహ్మచారి, సైదయ్య, భిక్షపతి, బాలయ్య, రైతులు పాల్గొన్నారు.

# ‘సడక్ బంద్‌ను జయప్రదం చేయండి’

**చేర్యాల(సిద్దిపేట):** చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 29న చేపట్టనున్న సడక్ బంద్‌ను జయప్రదం చేయాలని మండల పరిధిలోని ముస్త్యాల జేఏసీ కన్వీనర్ కొంగరి వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. అన్ని అర్హతలు కలిగిన చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల జేఏసీ ప్రతినిదులు వెంకట్ మావో, చందు, ముస్త్యాల జేఏసీ ప్రతినిధులు అంజయ్య, యాదయ్య, బాలమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ● అడుగుకో గుంత.. తీరని చింత



అధ్వానంగా కాన్గల్ బీటీ రోడ్డు

**తొగుట(దుబ్బాక):** మండలంలోని కాన్గల్ బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొమురవెల్లి మల్లన్నసాగర్ నిర్మాణ సమయంలో భారీ వాహనాలు తిరగడంతో మండలంలోని రోడ్లు ధ్వంసమయ్యాయి. రిజర్వాయర్ నిర్మాణం పూర్తికావడంతో మరమ్మతుల కోసం ప్రభుత్వం ఆరునెలల క్రితం సుమారు రూ. 14 కోట్లు మంజూరు చేసింది. దీంతో మెట్టు నుంచి రాంపూర్ వాగుగడ్డ, చందాపూర్, తొగుట– లింగంపేట గ్రామాల రోడ్ల నిర్మాణం చేపట్టారు. తుక్కాపూర్ క్రాస్ రోడ్డు నుంచి కాన్గల్ మీదుగా లింగంపేట క్రాస్‌రోడ్డు వరకు సుమారు 4 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ. 60 లక్షలు మంజూరు చేసింది. అయితే పంచాయతీరాజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పనులు చేపట్టలేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ● రోడ్డు అధ్వానం.. పట్టించుకోరేం !



**వర్గల్(గజ్వేల్):** మండలంలోని నాచారం వద్ద బేగంపేట వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. నర్సంపల్లి, బేగంపేట, వెంకటాయపల్లి తదితర గ్రామాలకు వెళ్లే ఈ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పెద్దసంఖ్యలో వాహనాలు తిరిగే ఈ రోడ్డుపై ప్రమాదాలు జరగక ముందే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# బొజ్జ గణపయ్య.. ఆరగించయ్యా

**జిల్లావ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం బొజ్జ గణపయ్యకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. పలు మండపాల వద్ద అన్నదానాలు చేపట్టారు.**



గజ్వేల్: లక్ష్మీప్రసన్నకాలనీలో మహిళల ప్రత్యేక పూజలు



క్యాసారంలో గణపతిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు



గజ్వేల్: భక్తులకు అన్నదానం చేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి



వర్గల్: పర్యావరణ హిత గణపతిని తీర్చిదిద్దిన దయాకర్‌ను సన్మానిస్తున్న రామకోటి రామరాజు



అక్కన్నపేట(హుస్నాబాద్): పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తదితరులు



సిద్దిపేట పట్టణంలో..



చిన్నకోడూరులో..

## సంక్షిప్త వార్తలు

**◆ పూజారి మృతి**

**కొమురవెల్లి(సిద్దిపేట):** మండల కేంద్రంలోని సమక్క సారలమ్మ జాతర వ్యవస్థాపకులు, పూజారి చింతల రాంమూర్తి (65) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

**◆ నూతన పాలకవర్గం**



**దుబ్బాక:** దుబ్బాక జామా మసీద్ నూతన పాలకవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా రంజాన్ మియా, జాకీర్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా షాదుల్, అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా మునీర్, సహాయ కార్యదర్శిగా హాజీ బాబా, కోశాధికారిగా హుస్సేన్, సలహాదారులుగా మైనోద్దీన్, హమీద్ నియామకం అయినట్లు మసీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఖలీల్ తెలిపారు.

**◆ ఆర్థికసాయం**

**వర్గల్(గజ్వేల్)/చిన్నకోడూరు(సిద్దిపేట):** మండలంలోని మల్లారెడ్డిపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సలేంద్రి యాదగిరి కుటుంబాన్ని ఆదివారం మండల కాంగ్రెస్ నాయకుడు సీహెచ్ అనిల్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబాన్ని ఓదార్చి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే చిన్నకోడూరు మండల పరిధిలోని గోనెపల్లికి చెందిన తాళ్లపల్లి తిరుపతిగౌడ్ శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం కుటుబాన్ని పరామర్శించి రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేశారు.

**◆ నీటి సమస్య పరిష్కారానికి కృషి**

**దుబ్బాక:** దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేటలో నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కౌన్సిలర్ బంగారయ్య తెలిపారు. ఆదివారం 10వ వార్డులో నూతనంగా వేస్తున్న బోరు బావి పనులను ప్రారంభించారు. అలాగే ధర్మాజీపేట 9 వార్డులో పెద్దమ్మ దేవాలయం వద్ద కౌన్సిలర్ బత్తుల స్వామి ఆధ్వర్యంలో బోరు బావి పనులను ప్రారంభించారు.

**◆ పరామర్శ**

**వర్గల్(గజ్వేల్):** అంగన్‌వాడీ టీచర్‌గా సేవలందిస్తూ అనారోగ్యంతో విజయలక్ష్మి అకాలమరణం చెందడం బాధకరమని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని మైలారంలో ఆమె మృతదేహానికి నివాళులర్పించి కుటుంబీకులను ఆర్థిక సాయం అందించారు.

**◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

**మిరుదొడ్డి(దుబ్బాక):** మండల పరిధిలోని అల్వాలకు చెందిన మామిడి కిష్టవ్వ, పిట్ల యాదయ్య, మునిగెల కవితకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీజేపీ మండల కార్యదర్శి గుర్రప్పగారి నిఖిల్ ఆదివారం అందజేశారు.

**◆ డ్రైవింగ్ లైసెన్స్‌లు మంజూరు**

**సిద్దిపేటజోన్:** స్థానిక 33 వార్డులో ఆదివారం కౌన్సిలర్ తస్లిమ్ మోహిజ్ ఆధ్వర్యంలో యువకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు మంజూరు చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, జాకిర్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

**◆ ఆపదలో అండగా..**

**కోహెడరూరల్(హుస్నాబాద్):** స్నేహితురాలికి ఆపదలో అండగా నిలిచారు 10వ తరగతి 2001–02 బ్యాచ్ మిత్రులు. మండలంలోని చెంచల్ చెర్వుపల్లికి చెందిన వరలక్ష్మి భర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. ఆదివారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 60 వేల ఆర్థిక సహాయం అందించారు.

**◆ విరాళం**

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** మండలంలోని మునిగడపలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గమ్మ ఆలయానికి గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో రూ. 2 లక్షల విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా గౌడ సంఘం నాయకులు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఆలయాల అభివృద్ధికి తమవంతు విరాళం అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు బాలయ్య, ఐలయ్య, ప్రసాద్, హరి, నాగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

